క్లుప్తంగా

25న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

రంగంపేట: ఈనెల 25వ గురువారం విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేబీబీ నటరాజన్ శనివారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణతో పాటు సాంకేతిక సభ్యులు ఎస్. రాంబాబు, ఫైనాన్స్ సభ్యులు ఎస్.సుబ్బారావు, స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీకృష్ణ హాజరవుతారన్నారు.

మానవతావాది అక్కినేని



రంగంపేటలో దివంగత అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

రంగంపేట: ప్రముఖ సినీ నటుడు, దివంగత అక్కినేని నాగేశ్వరరావు విద్యాదాత, గొప్ప మానవతావాది అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు అన్నారు. స్థానిక అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతిని ఆయన అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరసుందరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు పేపరాయల రాంబాబు, విశిష్ట అతిథిగా కొల్లాటి ఇజ్రాయేలు హాజరై అక్కినేని సేవలను కొనియాడారు. ముందుగా దివంగత అక్కినేని నాగేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్ పిచ్చుకల అచ్యుత రామయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోడూరి వెంకటరత్నం, గోలి రాంబాబు, కొండేపూడి చిరంజీవి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



సీతానగరంలో దుర్గా ప్రసాదరావును సన్మానించిన ఉపాధ్యాయులు

సీతానగరం: సింగవరం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు గొంతిని వీరవెంకట దుర్గాప్రసాదరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎంఈవో కె.స్వామి నాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శనివారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయులుతోపాటు ఎంఈవో స్వామినాయక్ పాల్గొన్నారు. క్లస్టర్ సమావేశం అనంతరం దుర్గాప్రసాదరావును ఘనంగా సత్కరించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెదపూడి: ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని కాకినాడ జిల్లా డీఆర్డీఏ పీడీ అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం వి.అరుణ అధ్యక్షతన ఎంఎస్ఎంఈలపై చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు చేస్తున్న మహిళలకు శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాపారులకు ప్రభుత్వ గుర్తింపు ధ్రువపత్రం, బ్యాంకు రుణం, వడ్డీపై రాయితీ తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, క్లస్టర్ కోర్డినేటర్లు, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. పంటలకు మేలు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. ఏడీబీ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ఈ వర్షం మండలంలో సాగు చేస్తున్న వరి, మినుము, పంటలకు ఎంతో మేలు చేస్తుందని, ఉద్యాన పంటలైన మొక్కజొన్న, బొప్పాయి, జామ, మిరప, ఆయిల్‌పామ్ పంటలతో పాటు కూరగాయలు, ఆకు కూరల పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

సీతానగరం: మునికూడలికి చెందిన నరకుర్తి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇండుగుమల్లి వరప్రసాద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరప్రసాద్ తన బైక్‌పై అమ్మాయిని ఎక్కించుకుని వెళుతుండగా రామలక్ష్మి, భర్త వెంకటరాజ్ కమల్ చూశారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 18 అర్ధరాత్రి వరప్రసాద్ మద్యం సేవించి రామలక్ష్మి ఇంటి ముందుకు వెళ్లి పెద్దగా కేకలు వేసి, అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. బయటకు వచ్చిన రామలక్ష్మి, రాజ్ కమల్‌పై దాడి చేసి, దుర్భాషలాడుతూ కొట్టాడు. రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోలీసు నీడలో రోడ్డు నిర్మాణం

- ఏకపక్షంగా పనులు చేపట్టారని నిలదీస్తున్న స్థానికులు
- అడ్డుకుంటే అరెస్టు చేస్తామంటున్న అధికారులు
- రోడ్డు విస్తరణకు స్థలాలు ఇచ్చిన వారికి బెదిరింపులు
- కూటమి ప్రభుత్వంలో పారదర్శకత లోపించిందని ప్రజల ఆరోపణ



రఘుదేవపురం వద్ద పోలీసు సిబ్బంది సహకారంతో సాగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: పోలీసు బందోబస్తు నడుమ అధికారులు రఘుదేవపురం – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకంగా వ్యవహరించాల్సిన కూటమి ప్రభుత్వం పోలీస్ ఉక్కుపాదంతో బెదిరింపులకు పాల్పడుతోందని పలువురు ఆరోపించారు. కాతేరు నుంచి రఘుదేవపురం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మించగా అక్కడి నుంచి సీతానగరం వరకు పాత రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా అయిదు మీటర్లు (30 అడుగులు) రోడ్డుతో సరి పెడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు రఘుదేవపురం నుంచి రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల చేపట్టారు, స్థానికులు పాత రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా పనులు ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

కేసులు నమోదు చేస్తూ బెదిరింపులు

కాతేరు – సీతానగరం ఆర్అండ్‌బీ నాలుగు లైన్ల రోడ్డు పనులు రఘుదేవపురం శివారు వరకు పూర్తయ్యింది. రఘుదేవపురం నుంచి సీతానగరం కిలోమీటరున్నర రోడ్డు శిథిలమై గోతులు పడి వాహనచోదకులకు నరకప్రాయంగా మారింది. కాతేరు నుంచి రఘుదేవపురం శివారు నాలుగు లైన్ల రోడ్డు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వ రఘుదేవపురం నుంచి సీతానగరం రోడ్డు నాలుగు లైన్లు కాకుండా కేవలం 30 అడుగుల రోడ్డు పనులు ప్రారంభించడంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజలు నాలుగు లైన్ల రోడ్డు వేయాలని పనులను అడ్డుకున్నారు. ఈ ఘటనలో గత నెలలో పది మంది వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. నిర్మాణ పనులు కొనసాగడంతో ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన మరో పది మంది వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టు చేసి వారిని గోకవరం పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు.

ఏకపక్షంగా నిర్మాణ పనులు

పోలీసు బందోబస్తుతో ఏకపక్షంగా 30 అడుగుల రోడ్డు పనులు కూటమి ప్రభుత్వ చేపట్టింది. పాత రోడ్డును సెంటర్ చేసి ఇరువైపులా ఐదు మీటర్లు రోడ్డు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రఘుదేవపురంలో ఒక వైపు నివాసం ఉంటున్నవారు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు స్థలాలు అందించారు. మరో వైపున నివాసం ఉంటున్న వారు స్థలాలు ఇవ్వలేదు. ఆర్అండ్‌బీ అధికారులు స్థలాలు ఇవ్వని వారివైపున తక్కువ వెడల్పుతో, స్థలాలు ఇచ్చిన వారి ఇంటి ముంగిట వరకూ ఎక్కువ వెడల్పుతో 30 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థలాలు ఇచ్చిన వారు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ ఇరువైపులా సమాన వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ఆందోళన చేపట్టారు. పోలీసు స్పెషల్ ఫోర్స్‌ను తీసుకువచ్చి రోడ్డు పనులు అడ్డుకుంటే కేసులు పెడతామని హెచ్చరించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రఘుదేవపురం – సీతానగరం వరకు రోడ్డు పనులు పోలీసుల నీడలో కొనసాగుతున్నాయి.

కేసులు పెడతామని బెదిరిస్తున్నారు



నాలుగు లైన్ల రోడ్డుకు స్వచ్ఛందంగా ఇంటి ముందు స్థలాలు ఇచ్చాం. ఇప్పుడు 30 అడుగుల రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించారు. మరో వైపు ఉన్న వారు స్థలాలు ఇవ్వలేదు. ఆ వైపు తక్కువ వెడల్పుతో, మావైపు ఎక్కువ వెడల్పుతో నిర్మాణం చేపట్టి 30 అడుగుల రోడ్డు చూపిస్తున్నారు. దానిని అడ్డుకుంటే పోలీసులతో బెదిరిస్తున్నారు. రోడ్డు పనులు అడ్డుకుంటే కేసులు పెడతామని హెచ్చరిస్తూ భయాందోళకు గురి చేస్తున్నారు.

– వీరవరపు శివ, రఘుదేవపురం

నాలుగు లైన్ల రోడ్డు వేయమంటే కేసులు



రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు నాలుగు లైన్ల రోడ్డు వేయమంటే ఇరవై మందిపై కేసులు పెట్టారు. 30 అడుగుల రోడ్డు వేయడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. పారదర్శకంగా రోడ్డు వేయాలని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. పోలీసు బందోబస్తుతో రోడ్డు పనులు చేపట్టడం విడ్డూరంగా ఉంది.

– పోలినాటి ఈశ్వరుడు, చినకొండేపూడి

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ కీలకం

రాజానగరం: నేరాలకు సంబంధించిన కేసుల్లో వాస్తవాలను వెలికితీయడంలో ఫోరెన్సిక్ సైన్స్ ఎంతో కీలకంగా ఉంటుందని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు అన్నారు. క్యాంపస్‌లోని గైట్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ ఫోరెన్సిక్ సైన్స్ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే 'హాకథాన్'

ఇంజినీరింగ్ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు 'హాకథాన్' వంటి కార్యక్రమాలు తోడ్పడతాయని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. స్మార్ట్ ఇండియా హాకథాన్ 2025కి సంబంధించి ఇంటర్నల్ హాకథాన్‌ను క్యాంపస్‌లోని గైట్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రపంచంలోని వివిధ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పశువుల నీళ్లతొట్టెలు శుభ్రం

రంగంపేట: మర్రిపూడిలోని పశువుల నీళ్ల తొట్టెలను శుభ్రం చేయించినట్టు సర్పంచ్ వేము మాధవిచిరంజీవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని పశువుల నీళ్ల తొట్టెలు చెత్తాచెదారంతో ఉండి నాచుపట్టడంతో పంచాయతీ కార్మికులతో వాటిని బ్లీచింగ్‌తో శుభ్రం చేయించి, నీటితో నింపినట్టు తెలిపారు. ఈ తొట్టెల్లో నింపిన నీటిని పశువులు తాగుతాయని తెలిపారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



ఆరికరేవులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు విజయలక్ష్మి



దొంతమూరు వైద్య శిబిరంలో మహిళలకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

బిక్కవోలు: ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జి.విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఆరికరేవులలోని స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని మహిళలు 126 మందికి వైద్య పరీక్షలు, అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి రెడ్డి నాగవేణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

రంగంపేట: మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.జయవర్ధిని అన్నారు. శనివారం మండల పరిధిలోని జి.దొంతమూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా బాగుంటుందన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధచూపాలన్నారు. స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరానికి 218 మంది మహిళలు హాజరుకాగా వారికి బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. కొందరికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ పిల్లి ప్రసాద్, హెచ్‌వీ పి.నాగలక్ష్మి, ఎంపీహెచ్ఏలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానం తగదు



బిక్కవోలులో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

బిక్కవోలు: భూ హక్కు పొందేందుకు చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు కోరారు. ఏపీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు శనివారం రెండురోజు స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మజ్జి గణపతిరావు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటీపీ విధానంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తప్పులను సరిదిద్దుకునే అవకాశం లేకపోవడంతో భూముల క్రయ విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోని ఉపాధ్యక్షుడు చినబాబు, కార్యదర్శి బాలాజీ కుమార్ కోశాధికారి సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు క్రీడాకారులకు ప్రభుత్వ కొలువులు

పెదపూడి: జి.మామిడాడకు చెందిన ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు 2025 డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికకావడంపై జి.మామిడాడ గ్రామ పూర్వ క్రీడాకారుల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ మెరిట్ లిస్టులో ద్వారంపూడి రామనాగభీమేశ్వర్‌రెడ్డి, షేక్ అలీమ్ పాషా, కందర్ప వాసు, వెంగళదాసు వెంకటేశ్వరరావు, బొచ్చా తులసి, పోలినాటి సునీత మొత్తం ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యారని తెలిపారు. ఇప్పటికే ఈ గ్రామంలో సుమారు 16 మంది ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని అన్నారు. తాజాగా 2025 డీఎస్సీలో అర్హత సాధించినవారంతా పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారని, ఆటలపై మక్కువతో నైపుణ్యం సాధించడంతోపాటు స్థానిక బీపీఈడీ కాలేజీలో కోర్సులు పూర్తి చేసి ప్రభుత్వ కొలువులు సాధించారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన ఆరుగురిని గ్రామ పెద్దలు, గ్రామ పూర్వ క్రీడాకారుల సంఘం, వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్, గ్రామ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ప్రతినిధులు తదితరులు అభినందించారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టండి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ: ప్రాధాన్య క్రమంలో నగరంలో అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాధిపతులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలో చేపట్టిన 15 రహదారుల విస్తరణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు వీధుల్లో నీరు నిలిచిపోకుండా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లోని తాగునీటి పైపులైన్లు ఉంటే వాటిని మార్చాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, ఎంహెచ్ఓ వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, మదర్సా అలీ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సొమ్ము దోచుకోవాలని కుట్ర

- ఆరోపణలు వెల్లువెత్తడంతో నిధులు జమ చేసిన కూటమి నేతలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి వెల్లడి



అనపర్తి: పెదపూడి మండలం పైన గ్రామ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతుల సొమ్ములు దోచుకోవాలని చేసిన కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన అనపర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పదిరోజుల క్రితం లేవనెత్తిన రూ.13 లక్షల అవినీతి ఆరోపణలు అక్షర సత్యమని నిరూపితమయ్యాయని అన్నారు. తాను ఈ అవినీతి వ్యవహారాన్ని ప్రజలకు బహిర్గతం చేయగానే విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకుంటామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని అన్నారు. ఎటువంటి విచారణ వివరాలను బహిర్గతం చేయకుండా పదిరోజుల్లోనే నాలుగు విడతలుగా ఆ సొమ్మును సొసైటీకి జమ అయ్యాయని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో రూ.80 లక్షల ముడుపుల వ్యవహారం ఇంకా పరిష్కారం కాలేదని ఆయన అన్నారు. అవినీతి వ్యవహారాలను ఒక్కొక్కటి బయట పెడుతుంటే దిక్కుతోచని స్థితిలో వాటిని పాలక పార్టీ అంగీకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డొంక తిరుగుడు వివరణలు ఇస్తూ అవినీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

అధికార పార్టీ నేతల అండదండలతో మట్టి తవ్వకాలు

- రామేశ్వరంలో అక్రమంగా మట్టి తరలింపు
- అధికారుల అనుమతులు లేని వైనం



రామేశ్వరంలో పశ్చిమ ఏలేరు మురుగు కాలువ గట్టును తవ్వి ట్రాక్టర్‌పై మట్టి వేస్తున్న జేసీబీ



పశ్చిమ ఏలేరు మురుగు కాలువ గట్టు వద్ద మట్టి తవ్విన ప్రాంతం

పెదపూడి: మండల పరిధి రామేశ్వరంలోని పశ్చిమ ఏలేరు మురుగు కాలువ గట్టుపై అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రోజుకు సుమారు 4 నుంచి 5 ట్రాక్టర్లు, జేసీబీ సహాయంతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టి సుమారు రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై నాలుగు రోజుల క్రితం డ్రెయినేజీ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ వారు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కులు విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నేతల అండదండలతో తవ్విన మట్టిని చేపల చెరువుల గట్టు రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే తరహాలో మట్టిని తవ్వేస్తే సమీప పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని, సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని నిలువరించిన అధికారులు ఎందుకు వాటిని విడిచిపెట్టారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కాకినాడ డ్రెయినేజీ ఏఈ కె.వరప్రసాద్‌ను వివరణ కోరగా శనివారం ఫిర్యాదు అందడంతో వెంటనే తమ సిబ్బందిని ఘటన స్థలానికి పంపించి మట్టి తరలింపును అడ్డుకున్నామని తెలిపారు. తవ్వకాలపై తహసీల్దార్, తమ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

మొక్కలను సంరక్షించాలి



బిక్కవోలులో మొక్క నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని, వాతావరణ కాలుష్యం తగ్గి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బిక్కవోలు మండల పరిషత్ వద్ద గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలోని పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. శనివారం ముగ్గళ్ల ఎంపీపీ స్కూల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపీపీతోపాటు ప్రధానోపాధ్యాయుడు శాంతి రాజు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది, విద్యార్థుల పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

పెదపూడి: సమష్టి కృషితో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా నిర్వహించాలని కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఆమె మొక్కను నాటి వ్యవసాయశాఖ అసిస్టెంట్‌కు దత్తత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శ్రీనువాసు, సచివాలయం కార్యదర్శి జి.ఉషారాణి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పాలమూరులో గర్భిణులకు సామూహిక సీమంతం

అనపర్తి: పాలమూరు కల్యాణ మండపంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66 మంది గర్భిణులకు సామూహిక సీమంతం, 10 మంది చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించినట్టు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ తోట శ్రీదేవి, మూడు మండలాల ప్రజా ప్రతినిధులు, మూడు మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఏపీఎం మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించి వాటి విశేషాలు అడిగి తెలుసుకున్నారు.